సాక్షి ప్రకాశం
గురువారం । 12 । సెప్టెంబర్ । 2024



ఆస్పత్రిలో ఆకలి కేకలు

కనిగిరి ప్రభుత్వాస్పత్రిలో నెల రోజులుగా రోగులు ఆకలి కేకలు పెడుతున్నారు. గత నెల 15 నుంచి రోగులకు ఇచ్చే డైట్ ఇవ్వడం లేదు. - 8లో..



దాడి కేసులో నిందితుల్ని శిక్షించాలి

జిల్లా కోఆపరేటివ్ ఆడిట్ అధికారి రాజశేఖర్‌పై దాడిచేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కుప్పం ప్రసాద్ డిమాండ్ చేశారు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
35.7/27

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల చిరుజల్లులు పడవచ్చు. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

అప్రంటీస్ మేళాలో 103 మంది ఎంపిక



అప్రంటీస్ మేళా నిర్వహిస్తున్న అధికారులు

ఒంగోలు: ఐటీఐ పాసైన విద్యార్థులు స్థానికంగా నిర్వహించిన ప్రధానమంత్రి జయియా అప్రంటీస్ మేళాలో పాల్గొని 103 మంది అప్రంటీస్‌కు ఎంపికయ్యారని ప్రధానమంత్రి జాతీయ అప్రంటీస్ మేళా సహాయ అప్రంటీస్ సలహాదారు ఎంవీ నాగేశ్వరరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఐటీఐలో బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలు వ్యాపార సంస్థల ప్రతినిధులు పాల్గొని వీరిని ఎంపిక చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 224 మంది విద్యార్థులు హాజరయ్యారని, వారిలో 103 మంది అప్రంటీస్ శిక్షణకు తాత్కాలికంగా ఎంపికయ్యారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన అప్రంటీస్ మేళాలో ఐటీఐ పాసైన విద్యార్థులకు లభించిన గొప్ప అవకాశం ఈ అప్రంటీస్ మేళా అన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన 103 మందిని అభినందించడంతోపాటు మిగిలిన వారు కూడా నైపుణ్యాలను పెంచుకుంటూ ముందుకు సాగాలని సూచించారు.

ట్యాబ్‌లు వినియోగించుకునేలా శిక్షణ ఇవ్వాలి



మాట్లాడుతున్న ఎస్ఎస్ఏ ఏఎంవో రమేష్

ఒంగోలు: విజన్ 2025 లో భాగంగా ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులకు ట్యాబ్స్ పంపిణీ చేశారని, వాటిని వారు సద్వినియోగం చేసుకునేలా శిక్షణ ఇవ్వాలని సమగ్రశిక్ష సహిత విద్య జిల్లా ఇన్‌చార్జి కోఆర్డినేటర్ యం.రమేష్ అన్నారు. స్థానిక రెడ్‌క్రాస్ భవనంలో బుధవారం సహిత విద్య రిసోర్సు పర్సన్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిత కేంద్రాల్లో పని చేస్తున్న రిసోర్స్ పర్సన్స్‌కు, హైస్కూల్‌లో పని చేస్తున్న స్పెషల్ టీచర్లకు ట్యాబ్స్ అందజేశామన్నారు. రాష్ట్ర సహిత విద్య విభాగం, సమగ్రశిక్ష ఆధ్వర్యంలో సహిత విద్య రిసోర్స్ పర్సన్ లకు టాబ్‌ల వినియోగం కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకులు నరసింహం మాట్లాడుతూ ట్యాబ్స్ వినియోగించాలని, రిసోర్స్ పర్సన్స్ వివిధ యాప్‌ల ద్వారా దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక విద్యను అందించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సహిత విద్య అసిస్టెంట్ కో ఆర్డినేటర్ మల్లికార్జున, రిసోర్స్ పర్సన్స్ సునీల్, లక్ష్మీ నాయుడు పాల్గొన్నారు.

పొగాకు ధర గరిష్టంగా రూ.358

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు రీజియన్ పరిధిలో పొగాకు ధర బుధవారం గరిష్టంగా కేజీ రూ.358 పలికిందని ఆర్ఎం లక్ష్మణరావు తెలిపారు. కందుకూరు 1, 2, కనిగిరి, డీసీ పల్లి, కలిగిరి, పొదిలి తదితర కేంద్రాల్లో 147వ రోజు వేలం పాటలో 6477 బేళ్లు రాగా, 4561 బేళ్లు కొనుగోలయ్యాయి. 1916 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో గరిష్టంగా రూ.358, కనిష్ట ధర రూ.178, సరాసరి రూ.270.45 పలికింది.

అక్రమ గ్రానైట్‌కు టీ ట్యాక్స్

అధికార టీడీపీ నేతల అండతో యథేచ్ఛగా గ్రానైట్ చీకటి దందా

'సంపద సృష్టిస్తా.. ఆదాయం పెంచే మార్గాలు చూపిస్తా' అని ఎన్నికల ముందు కాలికి బలపం కట్టుకుని తిరుగుతూ నారా చంద్రబాబునాయుడు చెప్పిన మాటలు గుర్తున్నాయా? ఆయన సంపద సృష్టించడం అటుంచితే.. టీడీపీ నేతలు వక్ర మార్గంలో దండిగా సంపాదిస్తూ ఖజానాకు సున్నం రాస్తున్నారు. గ్రానైట్ అక్రమ రవాణాకు అన్ని విధాలా సహకరిస్తూ టీ–ట్యాక్స్(తెలుగుదేశం ట్యాక్స్) వసూలు చేస్తున్నారు. పైసా పెట్టుబడి లేకుండా ఏరోజుకారోజు కట్టలకొద్దీ డబ్బు అధికార పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిల జేబుల్లోకి చేరుతోంది. ఒక ట్రిప్పుకు బిల్లు చెల్లించి దానిపైనే రోజంతా టన్నుల కొద్దీ గ్రానైట్‌ను తరలించుకుపోయేలా సహకరించినందుకుగాను రోజూ సుమారు కోటిన్నర రూపాయలు కప్పం కడుతున్నట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. టీ–ట్యాక్స్ చెల్లిస్తున్న కంటైనర్ల జోలికి వెళ్లొద్దంటూ సంబంధిత శాఖల అధికారులకు హుకుం జారీ చేయడంతో వారు మొక్కుబడి దాడులకే పరిమితమయ్యారు.



విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకుని ఆర్టీవో కార్యాలయంలో ఉంచిన గ్రానైట్ లారీలు

- రోజూ 150 కంటైనర్లు 'పరాయి' రాష్ట్రాలకు..
- ఒకే బిల్లుతో ఖజానాకు చిల్లు పెడుతున్న అక్రమార్కులు
- టీడీపీ నేతలకు రోజూ సుమారు రూ.1.50 కోట్లు కప్పం
- మూడు నెలలుగా ప్రభుత్వ ఖజానాకు రూ.వందల కోట్లలో నష్టం
- సంతనూతలపాడు, దర్శి, అద్దంకి హైదరాబాద్‌కు, ఒంగోలు, సింగరాయకొండ, నెల్లూరు మీదుగా చెన్నైకి అక్రమ రవాణా
- అర్ధరాత్రులు జేబులు నింపుకొంటున్న ఎమ్మెల్యేలు, టీడీపీ ఇన్‌చార్జిలు
- మొక్కుబడి దాడులకే పరిమితమైన మైనింగ్, విజిలెన్స్ అధికారులు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ప్రపంచ ప్రసిద్ధిగాంచిన బ్లాక్ గ్రానైట్ పచ్చ నేతలకు కాసుల వర్షం కురిపిస్తోంది. అధికారంలోకి రాగానే అక్రమ దందాకు తెరలేపిన టీడీపీ నేతలు గడిచిన మూడు నెలల్లో రాష్ట్ర ఖజానాకు రూ.వంద కోట్లకు పైగా గండి కొట్టారు. ఓ వైపు ఖజానాలో డబ్బు లేదంటూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ బీద అరుపులు అరుస్తున్నారు కానీ, ఆదాయానికి గండి పెట్టి అక్రమార్జనకు తలుపులు తెరిచిన టీడీపీ నేతలను అదిలించిన పాపాన పోలేదు.

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో చీమకుర్తి, బల్లికురవ, మార్టూరు తదితర ప్రాంతాల్లో గ్రానైట్ క్వారీలు ఉన్నాయి. చీమకుర్తి వద్ద రామతీర్థంలో 20 క్వారీలు రన్నింగ్‌లో ఉన్నాయి. వీటికి అనుబంధంగా 1800 పరిశ్రమలు నిర్వహిస్తున్నారు. వీటి నుంచి 3 నెలలుగా టన్నుల కొద్దీ గ్రానైట్ పొరుగు ప్రాంతాలకు రాత్రుళ్లు అక్రమంగా తరలిపోతోంది. రాష్ట్రంలో ఇతర జిల్లాల్లో గ్రానైట్ క్వారీలను ప్రైవేట్ కంపెనీలకు అప్పగించారు. అయితే జిల్లాలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఈ ప్రాంతంలోని మంత్రులు, ఎమ్మెల్యేలు నారా లోకేష్‌ను కలిసి ఎవ్వరికీ ఇవ్వకుండా చేసుకున్నారు.

ఒకటే బిల్లు.. 40 కంటైనర్లు!

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు శ్లాబ్ సిస్టంను ప్రవేశపెట్టి ప్రభుత్వానికి ఆదాయంతో పాటు, వ్యాపారులకు ఇబ్బందులు లేకుండా చేశారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం దానిని తుంగలోకి తొక్కింది. ఫలితంగా ప్రభుత్వ ఖజానాకు భారీగా చిల్లు పడుతోంది. పొరుగు రాష్ట్రానికి వెళ్లే కంటైనర్‌కు బిల్లు తప్పని సరిగా చూపించాలి. అయితే ఒక కంటైనర్‌కు బిల్లు తీసుకుంటే రాష్ట్ర ప్రభుత్వానికి రాయల్టీ, జీఎస్టీ కింద రూ.40 వేలు చెల్లించాలి. ఇక్కడే అక్రమార్కులు దందాకు తెరతీశారు. అధికార పార్టీ మంత్రులు, ఎమ్మెల్యే, నాయకులు అండదండలతో కేవలం ఒక కంటైనర్‌కు మాత్రమే బిల్లు తీసుకుని, దానినే చూపిస్తూ 30 నుంచి 40 కంటైనర్లను పొరుగు రాష్ట్రాలకు యథేచ్ఛగా తరలించేస్తున్నారు. ఇలా తమిళనాడు, తెలంగాణాకు రోజుకు 150 కంటైనర్లు అక్రమంగా తరలిపోతున్నాయని విశ్వసనీయ సమాచారం. రోజూ అక్రమ రవాణాదారులు ఒక్కో కంటైనర్‌కు రూ.15 వేల లెక్కన.. అంటే సుమారు రూ.కోటిన్నర టీడీపీ నేతలకు టీ–ట్యాక్స్ రూపంలో కప్పం కడుతున్నట్లు జోరుగా చర్చ నడుస్తోంది. ప్రభుత్వానికి రాయల్టీ రూపంలో రావాల్సిన రూ.వందల కోట్ల సొమ్ము టీడీపీ నేతలు స్వాహా చేస్తున్నారు.

రవాణా ఇలా..

తమిళనాడు, తెలంగాణా రాష్ట్రాలకు రోజు గ్రానైట్ కంటైనర్లు తరలివెళ్తున్నాయి. తమిళనాడుకు జిల్లాలోని ఒంగోలు, కొండపి నియోజకవర్గాల మీదుగా లారీలు వెళ్తున్నాయి. అలాగే ఎస్ఎన్‌పాడు, దర్శి, అద్దంకి పట్టణాల మీదుగా తెలంగాణాకు అక్రమంగా గ్రానైట్ కంటైనర్లు తరలివెళ్తున్నాయి. కొన్ని కంటైనర్లు పొదిలి మండలం ఏలూరు నుండి మార్కాపురం మీదుగా, హైదరాబాదుకు రెండు రాష్ట్రాలకు వెళ్లే చెక్ పోస్టుల వద్ద అధికారులను మేనేజ్ చేస్తూ గుట్టు చప్పుడు కాకుండా కోట్లు విలువైన సంపదను దోచేస్తున్నారు. కంటైనర్లు వెళ్లే నియోజకవర్గాల మంత్రులు, అధికార పార్టీ ఎమ్మెల్యేలు,నాయకులకు భారీగా నజరానా ముట్టజెబుతునట్టు ఆరోపణలు ఉన్నాయి. దర్శి నుంచి కురిచేడు, మీదుగా, ముండ్లమూరు మీదుగా జిల్లా దాటే లారీల వద్ద టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అనుచరులు అర్ధరాత్రి లారీలు ఆపి డబ్బు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ఈ దందా అంతా రాత్రి వేళ సాగుతుండటంతో అధికార పార్టీ నేతల అనుచరులు కాపాలా కాస్తూ కంటైనర్ల నుంచి రూ.15 వేలు లెక్కన వసూలు చేస్తున్నట్లు సమాచారం.

ఆ కంటైనర్లను వదిలేయండి

తమకు అనధికారికంగా టి–టాక్స్ (తెలుగు దేశం టాక్స్) చెల్లిస్తున్న గ్రానైట్ కంటైనర్ల జోలికి వెళ్లొదంటూ అధికార పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు సంబంధిత అధికారులకు హుకుం జారీ చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది పొరుగు జిల్లా నెల్లూరులో జరిగిన ఘనట. ఇటీవల జిల్లా దాటి నెల్లూరు మీదుగా చెన్నై వైపు వెళ్తున్న కంటైనర్‌ను ఆపిన సీఐపై ఆ జిల్లాకు చెందిన అధికార పార్టీ నేతలు తీవ్ర స్థాయిలో ఒత్తిడి తీసుకువచ్చారని తెలిసింది. దీంతో ఆ కంటైనర్ దర్జాగా వెళ్లిపోయింది. అధికార పార్టీ నేతల మౌఖిక ఆదేశాలతో నిఘా అధికారులు మొక్కుబడిగా దాడులు నిర్వహిస్తూ మమ అనిపిస్తున్నారు. మరికొన్ని శాఖల అధికారులు మనకెందుకులే అని నిద్ర నటిస్తున్నారు. అర్ధరాత్రులు తరలిపోతున్న లారీపై కనీస నిఘా కొరవడిందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. టి–ట్యాక్స్ ద్వారా అధికార పార్టీ పెద్దలకు సైతం ముడుపులు అందుతున్నట్టు తెలుస్తోంది.

ముగిసిన ఏకేయూ బోర్డు ఆఫ్ స్టడీస్ సమావేశాలు

- కమిటీలకు దిశానిర్దేశం చేసిన వీసీ ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి



మాట్లాడుతున్న ఏకేయూ వీసీ ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి

ఒంగోలు:

ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం బోర్డు ఆఫ్ స్టడీస్ (బీఓఎస్) సమావేశాలు బుధవారం ముగిశాయి. ఈ సమావేశానికి బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్లు, కమిటీ సభ్యులు స్థానిక ఏకేయూ సమావేశపు హాలులో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.రాజ మోహన్ అధ్యక్షతన హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి మాట్లాడుతూ ఉన్నత విద్యామండలి అధికారులు ఇచ్చిన సిలబస్‌ను దృష్టిలో ఉంచుకుని బీఓఎస్ చైర్మన్లు, కమిటీ సభ్యులు విధి విధానాలను నిర్ణయిస్తారని అన్నారు. బ్లూ ప్రింట్‌ను అనుసరించి ప్రశ్న పత్రాలు తయారీ చేస్తుంటారని చెప్పారు. ఏకేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హరిబాబు మాట్లాడుతూ పీజీ కోర్సులకు సంబంధించి రెండో సంవత్సరం విద్యార్థులకు విద్యా బోధన, బ్లూ ప్రింట్, ప్రశ్న పత్రాల తయారీ వంటి విషయాలను ఖరారు చేసేందుకు నిర్వహించిన ఒకరోజు సమావేశం విజయవంతంగా ముగియడంపై హర్షం వ్యక్తం చేశారు. స్టాటిస్టిక్స్, మ్యాథమాటిక్స్, కెమిస్ట్రీ, ఆయిల్ అండ్ ఫాట్స్, ఫార్మసీ, లా, హిస్టరీ, ఎకనామిక్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్, కంప్యూటర్ సైన్స్, ఎడ్యుకేషన్, సోషల్ వర్క్, కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్, బోటని అండ్ మైక్రో బయాలజీ, జువాలజీ అండ్ ఆక్వా కల్చర్, ఫిజిక్స్ తదితర విభాగాలకు సంబంధించిన బీఓఎస్ సమావేశం ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్వహించినట్లు ఆంధ్రకేసరి యూనివర్శిటీ అకడమిక్ విభాగం డీన్ డాక్టర్ కే.గంగాధర్ తెలిపారు. మొత్తం 16 బోధనా విభాగాలుండగా, అన్నింటికీ సమావేశం జరగడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.



తల్లి చెంతకు తనయుడు

వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన వినాయక మండపాల్లో ఐదు రోజుల పాటు పూజలందుకున్న గణనాథులను బుధవారం నిమజ్జనానికి తరలించారు. జిల్లాలోని సముద్ర తీర ప్రాంతాలు, కంభం చెరువు, పలు రిజర్వాయర్లలో వాటిని నిమజ్జనం చేశారు. గణపతి బప్పా మోరియా అంటూ పిల్లలు, పెద్దలు ఉత్సాహంగా కేరింతలు కొడుతూ, రంగులు చల్లుకుంటూ ఆటపాటలతో ఘనంగా వినాయకుడికి వీడ్కోలు పలికారు. గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు వేలాదిగా తరలివచ్చిన జనంతో కొత్తపట్నం సముద్రతీరంలో కోలాహలం నెలకొంది. – సాక్షి, ఒంగోలు

గిరిజనుల అభివృద్ధే లక్ష్యం

- పీఎం జన్‌మన్ పటిష్టంగా అమలు చేయాలి
- కలెక్టర్ తమీమ్ అన్సారియా



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

పెద్దదోర్నాల: గిరిజనుల అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పీఎం జన్‌మన్) పథకాన్ని జిల్లాలో పటిష్టంగా అమలు చేసేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని చిన్న గుడిపాడులోని రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టులో బుధవారం ప్రధానమంత్రి జనజాతీ ఆదివాసీ న్యాయ మహాఅభియాన్ పథకం అమలుపై నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా పాల్గొని శాఖల వారీగా చేపట్టిన పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధే లక్ష్యంగా గిరిజనులు, చెంచులు నివసిస్తున్న హ్యాబిటేషన్లలో సురక్షితమైన గృహాలు, స్వచ్ఛమైన తాగునీరు, మెరుగైన ఆరోగ్య సంరక్షణ, విద్య, పోషకాహారం, రహదారి, టెలీ కమ్యూనికేషన్స్, కనెక్టివిటీ, అలాగే స్థిరమైన జీవనోపాధికి అవకాశాలతో వివిధ శాఖలకు సంబంధించిన 11 ఇండికేటర్స్‌ను కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. ఆ ఇండికేటర్స్‌ను సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగు పడేలా సంబంధిత శాఖల అధికారులు కృషి చేయాలన్నారు. ఆయా శాఖల ద్వారా చేపట్టిన పనులను క్షేత్ర స్థాయిలో ఎంపీడీఓలు పరిశీలించాలన్నారు. గిరిజనులు వంద శాతం ఆధార్ కార్డులు కలిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఆర్డీటీ ప్రత్యేక అధికారి కె.నాగరాజు, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సురేష్ కుమార్, డీటీడబ్ల్యూవో జగన్నాథరావు, డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వసుంధర, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ మాధురి, వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసప్రసాద్, లీడ్ జిల్లా మేనేజర్ రమేష్‌బాబు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి సురేష్‌కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి సుభద్ర, గ్రౌండ్ వాటర్ డీడీ విద్యాసాగర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఐ పక్షపాతం చూపిస్తున్నారు

- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

పుల్లలచెరువు:

యర్రగొండపాలెం సీఐ పక్షపాత వైఖరి అవలంబిస్తున్నారని యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆరోపించారు. బుధవారం ఎమ్మెల్యే ఒక కేసు విషయంలో పుల్లలచెరువు పోలీసుస్టేషన్ సందర్శించి ఎస్ఐ బాబురావుతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్తగా వచ్చిన సీఐ ప్రతి విషయంలో పక్షపాతం చూపిస్తున్నారని, ముద్దాయి ఏదైనా నేరం చేస్తే కోర్టులు, చట్టాలు ఉన్నాయని, అంతేకాని చితకబాదడం ఎంత వరకు సమంజసం అని అన్నారు. వినాయక చవితి ఉత్సవాల్లో కూడా పక్షపాతం చూపిస్తూ వైఎస్సార్ సీపీ కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. మంగళవారం



ఎస్ఐతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంద్రశేఖర్

రాత్రి సిద్దెనపాలెంలో జరిగిన సంఘటనలో వైఎస్సార్ సీపీ నాయకుడు గడ్డం సుబ్బయ్యను పోలీసులు అదుపులోకి తీసుకుని ఇబ్బందిపెట్టారు. దీంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చంద్రశేఖర్ బుధవారం సాయంత్రం పుల్లలచెరువు స్టేషన్‌కు వచ్చిన ఆయన సుబ్బయ్యకు స్టేషన్ బెయిల్ ఇప్పించారు. ఆయన వెంట రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుముల శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వసతుల లేమితో మున్సిపల్ కార్మికుల అవస్థలు

- ఒంగోలు నుంచి విజయవాడ వరద ముంపు ప్రాంతాలకు ఒంగోలు కార్మికులు
- తిరిగి ఒంగోలు రప్పించాలని నగర కమిషనర్‌కు వినతిపత్రం అందజేత



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ నేతలు

ఒంగోలు సబర్బన్: విజయవాడ వరద ముంపు ప్రాంతాలకు పంపిన ఒంగోలు నగరానికి చెందిన మున్సిపల్ కార్మికులకు వసతులు లేక నానా అవస్థలు పడుతున్నారు. వాళ్లను తిరిగి ఒంగోలుకు రప్పించాలని ఒంగోలు నగర కమిషనర్ కే.వెంకటేశ్వర రావుకు ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్‌కు చెందిన నగర సీఐటీయూ కమిటీ బుధవారం వినతిపత్రం అందజేశారు. ఒంగోలు నగరం నుంచి 300 మంది పారిశుధ్య కార్మికులను విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాలకు పంపించారు. అయితే 9 రోజులుగా కార్మికులకు సరైన వసతులు లేవని అల్పాహారం, భోజన సదుపాయాలు సక్రమంగా లేక కార్మికులు అనారోగ్యం బారిన పడుతున్నారని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. మూడు రోజుల నుంచి రాష్ట్ర అసోసియేషన్ నాయకులు కార్మికులు పనిచేస్తున్న ప్రాంతాల్లో పర్యటించారని, వాళ్ల సమస్యలను రాష్ట్ర అధికారులకు, మున్సిపల్ శాఖ మంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లారన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నగర కమిటీ నాయకులు టి.మహేష్, కొర్నెపాటి శ్రీనివాసరావుతో పాటు పలువురు ఉన్నారు.

సర్వీసు కోటా తగ్గించడం అన్యాయం

- రెండో రోజుకు చేరిన పీహెచ్‌సీ వైద్యుల దశలవారీ ఆందోళన
- జీవో 85 ని ఉపసంహరించుకోవాలని డిమాండ్



నల్ల బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహిస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

ఒంగోలు టౌన్: సర్వీసు కోటా తగ్గిస్తూ అకస్మాత్తుగా జీవోను మార్చేయడం వలన తమకు అన్యాయం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డా.రాహుల్, డా.ఖాదర్ మస్తాన్ బీ ఆవేదన వ్యక్తం చేశారు. జీవో 85కి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్త ఆందోళన కార్యక్రమంలో భాగంగా రెండో రోజు బుధవారం నల్ల బ్యాడ్జీలు ధరించి వైద్యులు విధులు నిర్వహించారు. సర్వీసు కోటాను 30 శాతం నుంచి 15 శాతానికి తగ్గించడం అన్యాయమని, ఇది తమ వృత్తిపరమైన ప్రగతిని దెబ్బ తీస్తుందన్నారు. జీవో 85 వలన గిరిజన ప్రాంతాల్లో తాము అందించిన సర్వీసుకు విలువే లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కోవిడ్ సమయంలో తమ జీవితాలను, తమ కుటుంబ సభ్యుల భవిష్యత్తును ప్రమాదంలో పెట్టి సేవలు అందించినా ఈ జీవో వలన పీజీ చేసే అవకాశాలు లేకుండా పోతాయన్నారు. దీని వలన గ్రామీణ, నిరుపేద ప్రజలకు నష్టం చేకూరుస్తుందని, తమ డిమాండ్ నెరవేరే వరకు ఆందోళనను కొనసాగిస్తామని తెలిపారు.

అటవీ అమరవీరులకు ఘన నివాళి

- పాల్గొన్న అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ విఘ్నేష్ అప్పావ్

మార్కాపురం:

జాతీయ అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మార్కాపురంలోని అటవీశాఖ కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్ విఘ్నేష్ అప్పావ్ అటవీ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో అశువులు బాసిన అమరవీరుల ఆశయాలు, నిబద్ధతను గుర్తిస్తూ, గౌరవిస్తూ, వారి ఆత్మకు శాంతి కలగాలని ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ సిబ్బంది రక్షణ కోసం వెపన్స్ శిక్షణ ఇచ్చిన వారికి త్వరలో రివాల్వర్స్ ట్రైనింగ్ కూడా ఇచ్చి ఆయుధాలు ఇస్తామని అన్నారు. అటవీ గ్రామాల్లో ఉన్న గిరిజనులతో సఖ్యతతో ఉండి వారికి అటవీ రక్షణ, వన్య ప్రాణి సంరక్షణ పట్ల అవగాహన కార్యక్రమాలు నిరంతరం చేపట్టి వారిని అటవీ రక్షణలో భాగస్వాములను చేయాలని తెలిపారు.

డివిజన్‌లోని అన్నీ బేస్‌క్యాంపుల్లో చెంచులను ఏర్పాటుచేసి వారికి పరోక్షంగా వారికి ఉపాధి కార్యక్రమాలైన జూట్ బ్యాగ్స్ తయారీ, తేనేటీగల పెంపకం, మష్‌రూమ్‌ల పెంపకం లాంటి కార్యక్రమాల్లో శిక్షణ ఇచ్చి ఆర్థిక ఎదుగుదలకు ప్రోత్సాహం ఇస్తారని అన్నారు. కార్యక్రమంలో దోర్నాల సబ్ డీఎఫ్ఓ, ఎఫ్ఆర్ఓలు, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీడీ విఘ్నేష్ అప్పావ్

14న బాలుర క్రికెట్ జట్టు ఎంపిక

ఒంగోలు సెంట్రల్: ప్రకాశం జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో వర్షాల కారణంగా వాయిదా పడిన ఉమ్మడి ప్రకాశం జిల్లా అండర్ 14 క్రికెట్ జట్టు ఎంపిక ఈనెల 14వ తేదీ నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కారుసాల నాగేశ్వరరావు తెలిపారు. ముంగమూరు రోడ్డులో ఉన్న అసోసియేషన్ సబ్ సెంటర్ నెట్స్‌లో ఎంపిక చేస్తారని చెప్పారు. ఎంపికైన జట్టు అక్టోబర్ 1న కడప, అనంతపురం జిల్లాలో జరిగే ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అంతర జిల్లాల పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారులు తప్పనిసరిగా వైట్ డ్రస్, షూస్, స్వంత కిట్‌తో తమ జనన ధ్రువీకరణ పత్రం (ఫారం 5), ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్‌తో హాజరు కావాలని 2010వ సంవత్సరం సెప్టెంబర్ ఒకటో తర్వాత జన్మించిన వారై ఉండాలని చెప్పారు. ఆసక్తి గల క్రీడాకారులు పూర్తి వివరాలకు కోచ్‌లు సుధాకర్, బి.చంద్రశేఖర్‌లు ఫోన్ నంబర్లు: 9246222999, 9701022333లను సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

నాలుగు ఇసుక టిప్పర్ల పట్టివేత

మద్దిపాడు: మండలంలోని దొడ్డవరం సమీపంలో ఇసుక అక్రమంగా తరలిస్తున్న నాలుగు టిప్పర్లను ఎస్సై శివరామయ్య పట్టుకుని సీజ్ చేశారు. దొడ్డవరం గ్రామంలో వినాయక నిమజ్జన కార్యక్రమాలు జరుగుతున్న నేపథ్యంలో మంగళవారం అర్ధరాత్రి ఎస్సై దొడ్డవరంలో వెళుతుండగా దేనువుకొండ వైపు నుంచి నాలుగు టిప్పర్లు అక్రమంగా ఇసుక తరలిస్తుండగా తనిఖీ చేసి అనుమతులు లేకపోవడంతో సీజ్ చేసి మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వాహనాలను మైనింగ్ శాఖకు అప్పగించనున్నట్లు ఆయన తెలిపారు.

భార్య హత్య కేసులో ఆర్మీ జవాన్ అరెస్టు

గిద్దలూరు రూరల్: భార్య హత్య కేసులో ఆర్మీ జవాన్ అయిన భర్తను మార్కాపురం ఇన్‌చార్జి డీఎస్పీ లక్ష్మీనారాయణ బుధవారం అరెస్టు చేశారు. మండలంలోని కేఎస్‌పల్లె గ్రామానికి చెందిన సల్లూరి నాగమణిని మే 4న ఉరేసుకొని మృతి చెందింది. ఆమె మృతిపై అనుమానంతో నాగమణి తల్లిదండ్రులు తమ కుమార్తెది ఆత్మహత్య కాదని, భర్త సంజీవయ్య హత్య చేసినట్లు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేసి పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా భర్త చంపినట్లు నిర్ధారించుకుని సంజీవయ్యను అరెస్ట్ చేశారు.

రైలు నుంచి జారిపడి యువకుడు మృతి


పీహెచ్‌సీలో ఉదయ్‌కిరణ్ మృతదేహం

కురిచేడు: రైలు నుంచి జారిపడి యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని వెంగాయపాలెం రైల్వే గేటు వద్ద బుధవారం ఉదయం జరిగింది. వివరాల్లోకి వెళితే నంద్యాల జిల్లా గోగినదిన్నె గ్రామానికి చెందిన పెద్దిబోయిన ఉదయ్‌కిరణ్(18) నంద్యాల నుంచి గుంటూరు వెళుతుండగా ప్రమాదం జరిగింది. రైలు నుంచి జారిపడగానే తీవ్ర గాయాలు కావడంతో పొలాలకు వెళ్లే రైతులు గమనించి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా మృతిచెందాడు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని మృతుని కుటుంబసభ్యులకు అప్పగించనున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి


మృతి చెందిన నాగిరెడ్డి

బేస్తవారిపేట: మండలంలోని పెంచికలపాడు సమీపంలో ఒంగోలు–నంద్యాల హైవే రోడ్డుపై మంగళవారం రాత్రి బైక్ అదుపుతప్పి, ఆటో బోల్తా పడిన ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడిన విషయం పాఠకులకు విదితమే. తీవ్రంగా గాయపడిన వారిలో దద్దవాడకు చెందిన కోటా నాగిరెడ్డి(68)ని గిద్దలూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం ఆయనను నంద్యాల తరలిస్తుండగా మార్గమధ్యంలో మృత్యువాత పడినట్లు బంధువులు తెలిపారు. ఎస్సై ఎస్వీ రవీంద్రారెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పండక్కి వచ్చి తిరిగిరాని లోకాలకు ..

ఒంగోలు టౌన్: వినాయక చవితి పండగకు వచ్చిన ఒక సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం..టంగుటూరు మండలం మర్లపాడు గ్రామానికి చెందిన చింతం శ్రీనివాసులు, ధనలక్ష్మి దంపతులకు ఇద్దరు సంతానం. పెద్ద కుమారుడు మణికంఠ (30) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. వినాయక చవితి పండక్కి ఊరికి వచ్చాడు. బుధవారం తెల్లవారుజామున ఒంగోలు వరకు వెళ్లి వస్తానంటూ మోటార్ బైక్‌పై బయలుదేరాడు. ఈ క్రమంలో ఒంగోలు మినీ బైపాస్‌లో వేగంగా వెళుతున్న మణికంఠ రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొన్నాడు. ప్రమాదంలో తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు తాలుకా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతానికి వ్యక్తి మృతి


వెంకటరావు మృతదేహం

మార్కాపురం: విద్యుదాఘాతానికి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన పట్టణంలోని అపార్టుమెంట్‌లో బుధవారం జరిగింది. వివరాల్లోకి వెళితే..కొనకనమిట్ల మండలం గాజులపల్లి గ్రామానికి చెందిన బండారు వెంకటరావు (21) అపార్టుమెంట్‌లో పనులు చేస్తుండగా విద్యుత్ తగలడంతో షాక్‌కు గురై మృతి చెందాడు. ఈ మేరకు ఎస్సై సైదుబాబు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


బుజ్జి గణపయ్య ప్రతిమలను కొత్తపట్నం పల్లెపాలెం సముద్ర తీరంలో నిమజ్జనం చేస్తున్న చిన్నారులు

గౌరీ తనయా.. శరణాలయ్యా..


గణనాథుడిని శరణు కోరుతూ భక్తితో నిమజ్జనం చేస్తున్న భక్తులు

కొత్తపట్నం: గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఒంగోలు నగరంతోపాటు పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను ఐదో రోజు బుధవారం కొత్తపట్నం, ఈతముక్కల సముద్ర తీరంలో నిమజ్జనం చేశారు. కొత్తపట్నం, ఈతముక్కల, మడరూరు బీచ్‌లకు 129 విగ్రహాలు తరలివచ్చాయి. 15 నుంచి 20 అడుగుల ఎత్తు ఉన్న విగ్రహాలను క్రేన్ల సాయంతో గంగ ఒడికి చేర్చారు. విగ్రహాల వెంట వేలాదిగా తరలివచ్చిన భక్తులతో తీరం కిక్కిరిసింది. కొత్తపట్నం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఒంగోలు టూటౌన్ సీఐ మేడా శ్రీనివాసరావు, ఎస్సై సుధాకర్ బాబు, మెరైన్, సివిల్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

- కొత్తపట్నం తీరంలో 129 గణేశ్ విగ్రహాలు నిమజ్జనం


గణనాథులను నిమజ్జనం చేస్తున్న భక్తులు


కొత్తపట్నం తీరంలో నిమజ్జనానికి బారులు తీరిన విగ్రహాలు

ఆస్పత్రిలో ఆకలి కేకలు

నిర్లక్ష్యం ఎవరిదైతేనేమీ..రోగులు మాత్రం ఆకలితో అలమటిస్తున్నారు. ఓ వైపు రోగంతో అసౌకర్యం, మరో పక్క సరైన ఆహారం అందక ఆకలితో అలమటిస్తూ రోగులు పడుతున్న ఇబ్బందులు చెప్పేవీ కావు. ఇదీ కనిగిరి ప్రభుత్వాసుపత్రిలో దుస్థితి. నెల రోజులుగా కనిగిరి ప్రభుత్వాసుపత్రిలో రోగులకు ఇచ్చే డైట్ నిలిచిపోయింది. ఏవో సాకులతో కాంట్రాక్టర్ నా వల్ల కాదంటూ తప్పుకుంటే ఇప్పటి వరకు ఏ అధికారి, ఏ నాయకుడు పట్టించుకోలేదు.

- కనిగిరి ఆస్పత్రిలో నెల రోజులుగా రోగులకు అందని ఆహారం
- చేతులెత్తేసిన కాంట్రాక్టర్
- ఆకలితో అలమటిస్తున్న రోగులు
- పట్టించుకోని వైద్యశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు



కనిగిరి ప్రభుత్వ ఆస్పత్రి


ఆస్పత్రిలో ఇన్‌పేషంట్లు

కనిగిరి రూరల్: కనిగిరి ప్రభుత్వాసుపత్రిలో దాదాపు నెల రోజులుగా రోగులు ఆకలి కేకలు పెడుతున్నారు. అనారోగ్య సమస్యలతో ఇన్ పేషంట్లుగా వైద్యశాలలో చేరి చికిత్సలు పొందుతున్న రోగులకు ఉదయం టిఫెన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందిస్తారు. అయితే కనిగిరి ప్రభుత్వ వైద్యశాలలో గత నెల 15 నుంచి రోగులకు ఇచ్చే డైట్ ఇవ్వడం లేదు. దీంతో రోగుల ఆకలి అల్లాడుతున్నారు.

నిత్యం 100కి పైగా ఓపీలు

వెనుకబడిన కనిగిరి ప్రాంతంలో ప్రభుత్వ వైద్యశాల పేదలకు వరం లాంటిది. వైద్యశాలలో వైద్యుల కొరత వేధిస్తున్నా నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి నిత్యం సుమారు 100కు పైగా ఓపీలు వస్తాయి. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతుండటంతో చిన్నారులు, వారి తల్లిదండ్రులతో ఆస్పత్రి నిండుకుంది. వాటి సంఖ్య పెరుగుతోంది. ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి రోగులు ఓపీ విభాగంలో క్యూ కడుతూ కన్పిస్తున్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని వివిధ గ్రామాల నుంచి కనిగిరి ప్రభుత్వ ఆస్పత్రికి పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన రోగులు అధికంగా వస్తారు. ఇక్కడ 30 నుంచి 35 మంది ఇన్‌పేషంట్లు ఎప్పుడూ ఉంటారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రోగికి ఉదయం 3 ఇడ్లీ చెట్నీ లేదా పొంగలి సాంబారు, మధ్యాహ్నం, రాత్రికి వేడివేడి అన్నం, సాంబారు లేదా రసం, పప్పు, పెరుగు, వేపుడు వైద్యశాలలో అందించాలి. కానీ నెల రోజులుగా ఈ డైట్ నిలిచిపోయింది. మధ్య తరగతి వర్గానికి చెందిన రోగులైతే బయట హోటళ్ల నుంచి ఏదో ఒకటి తెచ్చుకుని తింటుండగా పేద వర్గాలకు చెందిన వారు, అనాథలు, నిరాశ్రయులు అర్ధాకలితో అలమటిస్తున్నారు. బుధవారం ఆస్పత్రికి తనిఖీకి వెళ్లిన సమయంలో జ్వరపీడితులుగా ఉన్న ఇద్దరు చిన్నారులు బిక్కుబిక్కుమంటూ అర్ధాకలితో కన్పించారు. ఇలాంటి దృశ్యాలు ఆస్పత్రిలో నిత్య కృత్యంగా మారాయి. ఆస్పత్రిలో మాతా శిశు వైద్య సేవలు ప్రారంభమైతే ఇన్ పేషంట్ల సంఖ్య మరింత పెరగనుంది

ఎవ్వరూ ఎందుకు పట్టించుకోలేదు..?

రోగులకు ఇచ్చే డైట్‌ను ఒంగోలు చెందిన ఓ కాంట్రాక్టర్ తక్కువకు కోడ్ చేసి గత ఏడాది టెండర్‌లో దక్కించుకున్నాడు. అయితే ఆ కాంట్రాక్టర్ కనిగిరిలో మరొకరికి సబ్ కాంట్రాక్ట్ ఇచ్చినట్లు తెలిసింది. ప్రభుత్వం ఒక్కో రోగికి రూ.72 నుంచి రూ.80 వరకు చెల్లిస్తున్నట్లు తెలిసింది. అయితే టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ గిట్టుబాటు కావడం కావడం లేదని, సకాలంలో బిల్లులు ఇవ్వడం లేదని తెలిసింది. దీనికి తోడు స్థానికంగా సబ్ కాంట్రాక్టు తీసుకున్న వ్యక్తికి వైద్య సిబ్బందికి మధ్య పొసగపోవడం లేదు. దీంతో కాంట్రాక్టర్ నా వల్ల కాదంటూ తప్పుకున్నాడు. ఇదే విషయాన్ని స్థానిక వైద్యులకు లిఖితపూర్వకంగా తెలియజేసినట్లు సమాచారం. దీంతో అప్పటి నుంచి రోగులకు ఆహారం అందడం లేదు. స్థానిక వైద్య శాఖాధికారులు కూడా ఈ విషయంలో నెల రోజులుగా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. కేవలం ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి చేతులు దులుపుకున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



బయట నుంచి ఆహారం తెస్తున్నా

మా ఇద్దరు పిల్లలకు మూడు రోజులుగా జ్వరం. ఆస్పత్రిలోనే సెలైన్ కట్టించా. ఎవ్వరూ మాకు టిఫిన్ గానీ భోజనం గానీ పెట్టలేదు. దీంతో బయట హోటల్ నుంచి ఆహారం కొనుక్కొని తీసుకువచ్చి పెడుతున్నాం. బయటకు వెళ్లి రావడం ఇబ్బందిగా ఉంది.

– జయమ్మ, పాతూరు

స్పందించకుంటే ఆందోళన చేస్తాం



ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు నెల రోజులుగా డైట్ పెట్టకపోవడం బాధాకరం. పేద వర్గాలకు చెందిన ఇన్‌పేషంట్లు ఆకలితో అలమటిస్తున్నారు. సమస్యపై ప్రభుత్వ ఆస్పత్రిలోని వైద్యాధికారులు ఉదాసీనతగా వ్యవహరించడం సరైంది కాదు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తా. వెంటనే వైద్య శాఖ అధికారులు స్పందించి డైట్ అమలు చేయకుంటే ప్రత్యేక్ష ఆందోళన చర్యలు చేపడతాం.

– జి.బాలిరెడ్డి, ఏఐటీయూసీ జిల్లా నాయకులు

రెండు మూడు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తాం

గత నెల నుంచి కనిగిరి ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు ఇచ్చే డైట్ నిలిచిన విషయం మా దృష్టికి వచ్చింది. దీనిపై పలువురు ప్రజాప్రతినిధులు ఫిర్యాదు చేశారు. సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి రెండు రోజుజుల్లో సమస్యను పరిష్కరిస్తా. రోగులకు డైట్ అందించేందుకు చర్యలు తీసుకుంటాం.

– శేషుకుమార్, డీసీహెచ్

దాడి కేసులో నిందితులను శిక్షించాలి

- వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, ఆర్యవైశ్య కార్పొరేషన్ మాజీ చైర్మన్ కుప్పం ప్రసాద్ డిమాండ్


డీసీఏఓ రాజశేఖర్‌ను పరామర్శిస్తున్న కుప్పం ప్రసాద్

ఒంగోలు టౌన్: నిజాయితీపరుడిగా పేరొందిన జిల్లా కో ఆపరేటివ్ ఆడిట్ అధికారి పోలిశెట్టి రాజశేఖర్‌పై దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, ఆర్యవైశ్య కార్పొరేషన్ మాజీ చైర్మన్ కుప్పం ప్రసాద్ డిమాండ్ చేశారు. గుర్తు తెలియని దుండగుల దాడిలో గాయపడి ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డీసీఏఓ రాజశేఖర్‌ను ఆయన బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకే రక్షణ లేకుండా పోయిందని, ఇక సామాన్యుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వ ఉన్నతోద్యోగులను కొట్టినా దిక్కులేని దుస్థితి ఒంగోలులో ఉందన్నారు. ఆర్యవైశ్యుడైన రాజశేఖర్‌ను కుట్ర పూరితంగా హత్య చేసేందుకు ప్రయత్నించారని, క్రూరంగా దాడి చేసి గాయపరిచని ఇప్పటి వరకు నిందితులను శిక్షించలేదని, కనీసం అరెస్టు చేయలేదని మండిపడ్డారు. ఆర్యవైశ్యుల్లో ప్రభుత్వ ఉద్యోగులు తక్కువగా ఉంటారని, ఆ కొద్ది మందిని కూడా సక్రమంగా విధులు నిర్వర్తించకుండా ఇబ్బంది పెడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఎంతో మంది ఆర్యవైశ్యులపై దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ఆర్యవైశ్య సంఘాలను టీజీ వెంకటేష్ దెబ్బతీశారని, ఆర్యవైశ్య సంఘాన్ని ఒక పార్టీకి తాకట్టు పెట్టారని విమర్శించారు. ఆర్యవైశ్య కుల సంఘాన్ని నాశనం చేశారని మండిపడ్డారు. ఆర్యవైశ్యులను హత్యలు చేస్తున్నారని, ఒంగోలులో ఆర్యవైశ్యులను బలవంతంగా దుకాణాలు ఖాళీ చేయిస్తున్నారని విమర్శించారు. అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లకు ఇది తగదన్నారు. రాజశేఖర్‌కు ఆర్యవైశ్యులు అండగా ఉంటారని, ఆయనపై దాడి చేసిన వారిని చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

పూడ్చేందుకు చోటు లేదు!

- మార్కాపురంలో శవంతో నడిరోడ్డుపై దళితుల ధర్నా


మృతదేహంతో ధర్నా చేస్తున్న దళితులు

మార్కాపురం: మార్కాపురం చెరువుకట్ట సమీపంలో ఐటీఐ కళాశాల వద్ద దళితుల శ్మశాన వాటిక కబ్జాకు గురైందని, మృతదేహాలను ఖననం చేసేందుకు కాస్త చోటు చూపాలని కోరుతూ బుధవారం సాయంత్రం డ్రైవర్స్ కాలనీ, ఎస్టేట్ మధ్య రోడ్డుపై మృతదేహంతో దళితులు ధర్నాకు దిగారు. చెరువుకట్ట ఫస్ట్ కాలనీ వాసి సంగీతరావు(78) అనారోగ్యంతో మృతి చెందాడు. మృతదేహాన్ని పూడ్చేందుకు బంధువులు సిద్ధమయ్యారు. అయితే శ్మశానవాటికను గత రెండు రోజులుగా కొందరు కబ్జా చేశారని తెలియడంతో రోడ్డుపైనే మృతదేహాన్ని ఉంచి ధర్నా చేశారు. ట్రాఫిక్ స్తంభించడంతో పట్టణ ఎస్సై సైదుబాబు వెళ్లి మృతుని బంధువులకు సర్దిచెప్పడంతో ధర్నా విరమించారు.

రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపిక


రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైన బాలికలు


రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైన బాలురు

దర్శి: మండలంలోని చందలూరు పాఠశాలలో బుధవారం జరిగిన జిల్లా స్థాయి త్రోబాల్ సెలక్షన్‌లలో 24 మంది విద్యార్థులు ఎంపికైనట్లు త్రోబాల్ జిల్లా జాయింట్ సెక్రటరీ గురుప్రసాద్, పాఠశాల పీడీ సోము అంజిరెడ్డి తెలిపారు. పోటీలకు జిల్లాలోని ఇతర ప్రాంతాల నుంచి 80 మంది విద్యార్థులు పాల్గొనగా వారికి పోటీలు నిర్వహించారు. రాష్ట్రస్థాయి పోటీలకు 12మంది బాలురు, 12 మంది బాలికలు ఎంపికయ్యారన్నారు. ఈ నెల 21, 22 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో క్రీడాకారులు పాల్గొంటాని తెలిపారు. కార్యక్రమంలో గంగదేవిపల్లి పాఠశాల పీడీ రత్నం, టీఎస్‌పురం పీడీ జిలానీ, ఉపాధ్యాయుల పీవీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఊడ్చినందుకు వేతనమేది?

- వైపాలెంలో పారిశుధ్య కార్మికుల ఆందోళన


కార్యదర్శితో మాట్లాడుతున్న పారిశుధ్య కార్మికులు

యర్రగొండపాలెం: వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ యర్రగొండపాలెంలో పారిశుధ్య కార్మికులు స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదుట బుధవారం ఆందోళన చేపట్టారు. తమకు ఏడాది వేతన బకాయిలు చెల్లించకుండా వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిలు అడిగితే కొత్తవారితో పనులు చేయించుకుంటామని పంచాయతీ కార్యదర్శి ఈదుల రాజశేఖరరెడ్డి చెబుతున్నారని ఆరోపించారు. పంచాయతీ పరిధిలో 55మంది పారిశుధ్య కార్మికులు ఉన్నారు. వారిలో 20మంది స్వచ్ఛ భారత్ కార్మికులు, మిగిలిన 35మంది పంచాయతీ కార్మికులు పనులు చేస్తున్నారు. 20 మంది స్వచ్ఛ భారత్ కార్మికులకు రూ.6 వేల చొప్పున 12 నెలలకు, 35 మంది పంచాయతీ కార్మికులకు రూ.10500 లెక్కన 14 నెలలకు వేతనం చెల్లించాలని కోరారు. 6 నెలల వేతనం రెండు రోజుల్లో చెల్లిస్తామని కార్యదర్శి హామీ ఇవ్వడంతో కార్మికులు విధులకు హాజరయ్యారు.

మాలమహానాడు ఆధ్వర్యంలో ప్రతిఘటన ర్యాలీ


ప్రతిఘటన ర్యాలీ నిర్వహిస్తున్న మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బిల్లా చెన్నయ్య

ఒంగోలు: బహుజన సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి ఢిల్లీలో వర్గీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన కార్యక్రమానికి మద్దతుగా మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బిల్లా చెన్నయ్య ఆధ్వర్యంలో బుధవారం నగరంలో ప్రతిఘటన ర్యాలీ నిర్వహించారు. తొలుత స్థానిక కోలాస్ ఎదురుగా ఉన్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ర్యాలీ ప్రారంభించారు. ప్రతిఘటన ర్యాలీ అక్కడ నుంచి స్థానిక చర్చిసెంటర్‌కు చేరుకోగా వర్గీకరణకు వ్యతిరేకంగా మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. అనంతరం మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బిల్లా చెన్నయ్య మాట్లాడుతూ ఆర్టికల్ 341 ప్రకారం పార్లమెంట్లో బిల్లు సవరణ చేయకుండా కులాలను విడగొట్టే అధికారం సుప్రీంకోర్టుకు గానీ రాష్ట్రపతికి గానీ రాష్ట్ర ప్రభుత్వాలకు గానీ ఉండదన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో ఏబీసీడీ వర్గీకరణను క్రిమిలేయర్‌తో యాడ్ చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. క్రిమిలేయర్‌ను అనుసంధానిస్తే భవిష్యత్ తరాలకు వారికి ఎటువంటి రిజర్వేషన్లు ఉండవని, దాని ద్వారా షెడ్యూల్ కులాల వారు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఒంగోలు నగర అధ్యక్షురాలు నామాల షకీలా, మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు బత్తుల వెంకట్రావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తుల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

గండి కొట్టిన వారిపై చర్యలు తీసుకోండి

- చేపల కోసమే మోపాడు నీరు విడుదల
- ఇరిగేషన్ ఎస్‌ఈకి సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ వినతి


ఇరిగేషన్ ఎస్‌ఈకి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణ

ఒంగోలు టౌన్: చేపలు పట్టడం కోసమే కొందరు వ్యక్తులు మోపాడు చెరువులోని నీటిని అక్రమంగా విడుదల చేశారని, ఎలాంటి అనుమతులు లేకుండా నీటిని వదిలి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ డిమాండ్ చేశారు. ప్రకాశం జిల్లా సమితి నాయకులతో కలిసి ఇరిగేషన్ ఎస్‌ఈకి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాధారిత చెరువు అయిన మోపాడుకు నీరు చేరడం చాలా అరుదని, ఇటీవల కురిసిన వర్షాలకు 9 అడుగుల మేర నీరు చేరిందని, అయితే చెరువులో చేపలను పట్టుకునేందుకు చేపల కాంట్రాక్టర్లు నీటిని అక్రమంగా తూము ద్వారా వదిలి కంబాలదిన్నె మెయిన్ కెనాల్‌కు గండికొట్టారని తెలిపారు. లక్ష్మీ నరసింహపురం వద్ద కెనాల్‌కు గండికొట్టి ఉత్తరం పైపు కిలోమీటర్ వరకు ప్రొకెయినర్‌తో కాలువలు తీసి పొలాలకు మళ్లించారని తెలిపారు. దీంతో గ్రామానికి చెందిన ఎస్సీ, మైనారిటీలకు చెందిన పొలాల్లో నీరు నిలబడి కోతకు గురైందన్నారు. అధికారులు వెంటనే స్పందించి కెనాల్‌కు గండి కొట్టిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఈని కలిసిన వారిలో సీపీఐ కార్యదర్శి వర్గ సభ్యులు కె.వెంకటరావు, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.వీరారెడ్డి వున్నారు.